క్లుప్తంగా

ఆన్‌లైన్‌లో గ్రేడులు నమోదు చేయాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో ఆడే ప్రకాశ్

కెరమెరి: అన్ని రకాల పరీక్షలకు సంబంధించిన గ్రేడులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. శనివారం మండలంలోని కెలిబి పాఠశాలను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. పాఠశాల సెలవులకు చివరి రోజున పేరెంట్స్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని, తల్లిదండ్రుల ఎదుటే విద్యార్థుల ప్రగతి పత్రాలు విద్యార్థులకు అందించాలన్నారు. ప్రతిరోజు ఎండీఎం రిపోర్టును సమర్పించాలని ఆదేశించారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎస్సై గంగన్న

లింగాపూర్: దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడకుండా మండలకేంద్రంలోని గాంధీచౌక్ చౌరస్తాలో శనివారం పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా ఎస్సై గంగన్న చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బలిరాం, గణపతి, వినోద్, హసిరాం తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి కోయగూడలో క్రికెట్ పోటీలు

కౌటాల: మండలంలోని కోయగూడ గ్రామంలో ఈ నెల 21వ తేదీ నుంచి గ్రామ పంచాయతీ స్థాయి ఆదివాసీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రాజేశ్వర్, కోటేశ్వర్, శ్రీకాంత్ శనివారం తెలిపారు. వివరాలకు 7093389136, 6305174493, 9398895620 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్: పట్టణంలోని జన్కాపూర్‌లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో నెలవారి మరమ్మతులో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని అన్ని ప్రాంతాల్లో, ముర్వాడ్ ఏరియా గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మిరాజ్యం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు. ఆసిఫాబాద్ విద్యుత్ ఉప కేంద్రంలో నెలవారి మరమ్మతులో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు మండలంలోని చర్లకుంట జీపీ, బురుగూడ జీపీలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ రూరల్ ఏఈ ఉర్మిల ఒక ప్రకటనలో తెలిపారు.

అంబలి పంపిణీ ప్రారంభం


అంబలి పంపిణీ చేస్తున్న ఉబైద్ బిన్ యాహియా

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద శనివారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఉబైద్ బిన్ యాహియా అంబలి పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ఏటా అంబలి పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు రమణారెడ్డి, రావుల వినాయక్‌రావు, శంకర్, భీంరావ్, విశాల్, ముబషీర్, జావిద్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై పోరాడాలి

నార్నూర్: ఏజెన్సీలోని ఆదివాసీ విద్యార్థుల సమస్యలపై పోరాడాలని పున్నగూడ గ్రామపటేల్ పెందుర్ రమేశ్ అన్నారు. శనివారం గాదిగూడ మండలంలోని పున్నగూడ గ్రామంలో ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పెందూర్ సంతోష్‌ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఏజెన్సీ ప్రాంతంలో కనీస సౌకర్యాలు లేని మారుమూల గ్రామాల నుంచి అంచెంచెలుగా ఎదుగుతూ ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికవడంతో గర్వకారణంగా ఉందన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. ట్రాఫిక్ సీఐ ప్రణయ్‌కు వినతి పత్రం అందజేశారు.

ఘనంగా హనుమాన్ జయంతి

- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు
- ఆకట్టుకున్న శోభాయాత్రలు


పెంచికల్‌పేట్: మండల కేంద్రంలో శోభాయాత్ర

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో హనుమాన్ జయంతి శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయ ప్రధాన అర్చకుడు ఒరుగుల శిరీష్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు నరేశ్ శర్మ, ముదిగొండ రాజశేఖర శర్మ, పూర్ణ చందర్ శర్మ,మహేశ్ శర్మ, శ్రీధర్ శర్మలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన ప్రత్యేక పూజలు కలశగణపతి పూజ, పుణ్యాహవచనం, ధ్వజారోహణం, మహన్యాస ఏకాదశ రుద్రాభిషేకం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే దంపతులు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాదరావు, బీజేపీ నాయకులు అరిగెల నాగేశ్వర్ రావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్ ప్రత్యేక పూజలు చేశారు. డీఆర్‌డీవో దత్తారావు దంపతులు హోమంలో పాల్గొన్నారు. కేస్లాపూర్ హనుమాన్ ఆలయం అభివృద్ధికి రూ.10 లక్షల సీఎస్ఆర్ నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కోవ లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. మాజీ ఎంఎంసీ చైర్మన్ చిలువేరు వెంకన్న, మల్లేశ్, అరిగెల మల్లికార్జున్, బాలేశ్వర్ గౌడ్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. పట్టణంలోని బజార్‌వాడీ హనుమాన్ మందిర్‌తో పాటు పట్టణంలోని ఆలయాల్లో అన్నదానాలు చేపట్టారు. పట్టణంలోని బ్రాహ్మణవాడ పండరీనాథ్ ఆలయంలో అర్చకులు అనంత్‌శర్మ ఆధ్వర్యంలో వార్షికోత్సవం జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ ఆలయంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వరయంలో మజ్జిగ, వ్యాపారి సాయిని సంతోష్ ఆధ్వర్యంలో చల్లని మంచినీరు పంపిణీ చేశారు. ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చల్లని మంచినీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఉబేద్ బిన్ యాహియా, ముస్తాకిమ్, అఫ్రోజ్ బహెద్రా, బుబాకర్, మెరాజ్ పాల్గొన్నారు.

కెరమెరి: హనుమాన్ జయంతి పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని శివాలయంతో పాటు సావర్‌ఖెడా, బాబేఝరి, అనార్‌పల్లి, కెలికే, కెలిబి, సాకడ, సాంగ్వి, గోయగాం తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న భక్తులు ఉదయాన్నే దేవాలయాలకు వెళ్లి అంజన్న ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని శివాలయంలో అర్చకుడు కులకర్ణి బాపూదేవ్ ఆధ్వర్యంలో అభిషేకం చేశారు. నవగ్రహం, కలశ, గణపతి, గౌరీ ఆంజనేయస్వామి, నవగ్రహ పూజ నిర్వహించారు.

పెంచికల్‌పేట్: హనుమాన్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో శ్రీ వీరాంజనేయ హనుమాన్ శోభాయాత్రను శనివారం నిర్వహించారు. హనుమాన్ విగ్రహం వద్ద కమలాకర్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. శోభాయాత్రలో ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ జెడ్పీటీసీ సముద్రాల సరిత రాజన్న దంపతులు పాల్గొన్నారు. శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు ముస్లింలు పండ్లు పంపిణీ చేశారు.

దహెగాం: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతిని అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రంలో భక్తులు స్థానిక శివాలయం నుంచి పాత దహెగాంలో అభయాంజనేయ స్వామి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో యువకులు, మహిళలు నృత్యాలు చేశారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ శోభాయాత్రలో పాల్గొన్నారు. మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, నాయకులు, ప్రజలు ఉన్నారు.


కెరమెరి: మంగళహారతులిస్తున్న స్వాములు

లింగాపూర్: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో శనివారం ఘనంగా హనుమాన్ జయంతి నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో భోగ్ భండార్, అన్నదానం నిర్వహించారు.

ఆసిఫాబాద్‌రూరల్: హనుమాన్ జయంతిని శనివారం మండలంలోని మోతుగూడ, బూర్గుడ, బెల్గాంతో పాటు పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. జయంతి సందర్భంగా హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మోతుగూడ గ్రామంలో ప్రసన్న ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. బెల్గాంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు.


దహెగాం: శోభాయాత్రలో ఎమ్మెల్సీ దండె విఠల్

రెబ్బెన: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో ఆంజనేయస్వామి విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. గోలేటి టౌన్‌షిప్‌లోని కోదండ రామాయలంలో హనుమాన్ మాలధారణ స్వాములు 108 హనుమాన్ చాలీసా పారాయణం చేసిన అనంతరం హోమం చేశారు. మండల కేంద్రంలో సాయంత్రం హనుమాన్ శోభాయాత్ర కనుల పండువగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం గోలేటి టౌన్‌షిప్‌లోని కోదండ రామాలయంలో ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని రాచర్ల హనుమాన్ ఆలయం, దుబ్బగూడ ఆంజనేయ ఆలయంతో పాటు టోంకిని గ్రామంలోని శ్రీ సిద్ధి టోంకిని హనుమాన్ ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్రలు నిర్వహించారు. టోంకిని గ్రామంలో పల్లకిసేవ నిర్వహించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కౌటాల: మండల కేంద్రంలో శనివారం హనుమాన్ జయంతి పురస్కరించుకొని తలోడి యూత్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా తలోడి హనుమాన్ ఆలయం వద్ద శోభాయాత్రను ఎస్సై మధుకర్ ప్రారంభించారు. తలోడి చౌరస్తా మీదుగా కౌటాల-కాగజ్‌నగర్ ప్రధాన రహదారి వెంట స్థానిక మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు, యువకులు భారీగా శోభాయాత్రలో పాల్గొన్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


కెరమెరి: కలశంతో స్వాములు


పెంచికల్‌పేట్: పండ్లు పంపిణీ చేస్తున్న ముస్లింలు


కెరమెరి: కలశ పూజల్లో పాల్గొన్న భక్తులు



ఆసిఫాబాద్: ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో..


శోభాయాత్ర ప్రారంభిస్తున్న ఎస్సై మధుకర్


లింగాపూర్‌లో..


లింగాపూర్: భోగ్ బండార్ నిర్వహిస్తున్న పూజారి


పండరీనాథ్ ఆలయంలో పూజలు


గోలేటిలో హోమంలో పాల్గొన్న దోని శ్రీశైలం


రెబ్బెనలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

భద్రకాళీ ఆలయంలో 'దీక్షా సంస్కారం'

పెంచికల్‌పేట్: పంచకళపురి క్షేత్రంలోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో శనివారం దీక్షా సంస్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. భద్రకాళీ పీఠాధిపతి శ్రీ సిద్ధి శివప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చరణలతో భక్తులకు మంత్ర దీక్ష రుద్రాక్ష మాలధారణ చేశారు. ధర్మ సమాజా స్థాపనకు సంస్కార దీక్షలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో హనుమకొండ వీర శైవ సమాజ ప్రచార కార్యదర్శి సదానిరంజన్ సిద్ధాంతి, మఠం శివకుమార్, సాయి ప్రసాద్, చైతన్య రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


దీక్షా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం


తలంబ్రాలు సిద్ధం చేస్తున్న మహిళలు


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

రెబ్బెన: ఇందిరానగర్‌లోని స్వయంభూ మహంకాళి ఆలయంలో చైత్రపౌర్ణమి పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మూడు రోజుల జాతర మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. జాతర మహోత్సవంలో మొదటి రోజు శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ దంపతులు కల్యాణంలో కూర్చుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి అమ్మవారి కల్యాణానికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, కంకణాలు రాగా భాజా భజంత్రీల నడుమ ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం అశేష భక్తజన సందోహం నడుమ శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

నేడు బోనాల జాతర

మహంకాళి జాతరలో భాగంగా ఆదివారం అమ్మవారికి ఎంతో ఇష్టమైన బోనాల జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి బోనాల సమర్పణ పూజలతో పాటు నైవేద్యాలు, పట్టు వస్త్రాల సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులు కోళ్లు, మేకలు బలిచ్చి ఆలయ ప్రాంగణంలో వన భోజనాలు చేస్తుంటారని ప్రధాన అర్చకుడు దేవార వినోద్ తెలిపారు.

'సరిహద్దు' మార్గం అధ్వానం


వంతెనపై శిథిలమైన స్లాబ్


బయటకు వచ్చిన ఇనుప చువ్వలు

సిర్పూర్(టి): తెలంగాణలోని వెంకట్రావుపేట మహారాష్ట్రలోని పోడ్సా గ్రామాల మధ్య ఇరు రాష్ట్రాలకు సరిహద్దుగా పెన్‌గంగ నదిపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుతుండడం వాహనదారులకు ఆందోళన కలిగిస్తోంది. వంతెనపై పలుచోట్ల సిమెంట్ స్లాబ్ పగుళ్లు తేలి ఇనుప చువ్వలు బయటకు వచ్చాయి. గతంలో వంతెన పిల్లర్లు కుంగి పోవడంతో నెలల తరబడి రాకపోకలు నిలిచిపోయాయి. వంతెన మార్గం గుండా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రమాదకరంగా మారిన వంతెనకు మరమ్మతులు చేపట్టాలని సరిహద్దు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మబ్బులతో రైతు గుబులు

- గాలులు వీచినా భయాందోళన
- పదిహేను రోజుల క్రితం ఈదురుగాలులతో నష్టం
- చేతికొచ్చిన పంటలు నష్టపోతామని ఆవేదన


కెరమెరిలో చేతికొచ్చిన జొన్న పంట


నేలవాలిన మొక్కజొన్న (ఫైల్)

కెరమెరి: అన్నదాతకు అడుగడుగునా కష్టాలే ఎదురవుతున్నాయి. ఎంతో శ్రమించి వ్యయప్రయాసల కోర్చి సాగు చేసిన జొన్న పంట చివరిదశలో ఉంది. కోతలు ప్రారంభమయ్యే క్రమంలో మబ్బులు రైతుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. చిన్నపాటి గాలి వచ్చినా రైతులు ఆందోళన చెందుతున్నారు. గత పదిహేను రోజుల క్రితం వీచిన ఈదురుగాలులు, కురిసిన వడగళ్ల వానలకు నేల వాలిన జొన్న, మొక్కజొన్న పంటలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. మళ్లీ ఏ చిన్న గాలి వీచినా తుఫాను ముంచుకొస్తుందేమోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. సాయంత్రం 4 గంటల వరకు వాతావరణం బాగానే ఉంటున్నా ఆ తర్వాత మారిపోతోంది. మబ్బులుగా మారి చల్లటి గాలి వీచి వానలు కురిసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మళ్లీ వడగళ్ల వానలు వచ్చి, ఈదురుగాలులు వీచి పంటలను నష్టపరిస్తే పరిస్థితి ఏంటని రైతన్న దిగాలు చెందుతున్నాడు. మండలంలోని కొన్ని ప్రాంతాల్లో చేతికొచ్చిన జొన్న పంటను మరో 15రోజుల్లో కోయాల్సి ఉంది. ఆ లోపు ఎప్పుడైనా భారీ వర్షం కురిస్తే తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రెండో పంటగానే..

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉండగా.. 29 వేల ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేశారు. అందులో 24 వేల ఎకరాల్లో పత్తి, 800 ఎకరాల్లో జొన్న, 200 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు పండిస్తున్నారు. పత్తి పంట కాలం ముగిశాక రెండో పంటగానే జొన్న, మొక్కజొన్నలు సాగు చేస్తున్నారు. అతివృష్టి, అనావృష్టి వల్ల ఏటా రైతులు నష్టాలనే చవిచూస్తున్నారు. మండలంలోని ప్రాజెక్టులు పంట పొలాలకు నీరు అందించడం లేదు. దీంతో సొంతగా పొలాల్లో బోర్లు వేసి రైతులు పంటలు పండిస్తున్నారు. కొందరు నదులకు మోటార్లు బిగించి నీటిని వినియోగించుకుంటున్నారు.

గాలి వీచినా భయమే..



వారం రోజులుగా ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్నాయి. 15 రోజుల క్రితం ఈదురుగాలులతో వడగండ్ల వాన కురిసింది. దీంతో నా మూడు ఎకరాల్లో వేసిన జొన్న, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. ప్రతిరోజు సాయంకాలం అయిందంటే మబ్బులు కమ్ముకుని గాలులు వీస్తున్నాయి. చిన్న గాలి వీచినా భయాందోళన చెందుతున్నాం.

– కుర్సెంగ అర్జున్, పెద్ద సాకడ

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

కౌటాల: భారత రాజ్యాంగాన్ని బీజేపీ ప్రభుత్వం నుంచి రక్షించుకోవాలని కాంగ్రెస్ మండల కన్వీనర్ నికోడే గంగారాం అన్నారు. శనివారం మండలంలోని గుడ్లబోరి గ్రామంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ దేశంలో అప్రజాస్వామిక నియంతృత్వ పాలన చేస్తుందని ఆరోపించారు. నిండు పార్లమెంట్ సభలో అంబేడ్కర్‌ను అగౌరపరిచారని తెలిపారు. కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, గట్టయ్య, పోశం, భీంరావు, విఠల్, జ్యోతిరావు, మల్లయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం చేయాలి

వాంకిడి: బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో సోమవారం నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు కోరారు. శనివారం సంఘం నాయకులు మాట్లాడుతూ మెగా రక్తదాన శిబిరం ప్రారంభోత్సవానికి ఏఎస్పీ చిత్తరంజన్ రానున్నట్లు తెలిపారు. యువకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.